సాక్షి ప్రకాశం

మంగళవారం । 19 । మార్చి । 2024



చూసుకో..రాసుకో

ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోంది. విద్యార్థులే కాక, పరీక్ష సిబ్బంది కూడా స్లిప్పులు తీసుకెళ్లడం గమనార్హం. - 8లో..



నిరంతరం అప్రమత్తత అవసరం

ఎన్నికల దృష్ట్యా తనిఖీల సమయంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 35/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

మంగళవారం - ఇఫ్తార్ : సా॥ 6.26

బుధవారం - సహరీ : ఉ॥ 4.54





ఆకాశంలో ఫైటర్ జెట్ల చక్కర్లు



ఏయ్..అదిగో చూడు



తక్కువ ఎత్తులో ఎగురుతున్న సుఖోయ్ 30 ఫైటర్ జెట్



రన్‌వే పక్కన ఏర్పాటు చేసిన వైమానిక దళం కంట్రోల్ రూం



తక్కువ ఎత్తులో ఎగురుతున్న హ్యాకర్ ఫైటర్ జెట్ విమానం



ల్యాండ్ అవుతున్న ఏఎన్ 32 కార్గో విమానం



రన్‌వేపై ల్యాండ్ అవుతున్న డోర్నియర్ విమానం



రన్‌వే తనిఖీ చేస్తున్న సిబ్బంది



విమానాల ల్యాండింగ్‌ను ఆసక్తిగా చూస్తున్న స్థానికులు



రన్‌వేపై ఉన్న ఏఎన్32 కార్గో విమానం

– ఫొటోలు ఎం ప్రసాద్

రహదారిపై ఫ్లైట్.. రయ్..రయ్

కదన రంగంలో గగనం నుంచే భీకరదాడులు చేసి శత్రువులను గడగడలాడించే రెండు యుద్ధ విమానాలు, రెండు సామగ్రిని తరలించే కార్గో విమానాలు, డోర్నియర్ విమానం జాతీయ రహదారిపై పరుగులు తీశాయి. సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా కొరిశపాడు సమీపంలోని పి.గుడిపాడు వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై ఎమర్జెన్సీ ల్యాండ్ అయ్యాయి. యుద్ధాలు, ప్రకృతి విపత్తుల సమయంలో అత్యవసర సేవలతోపాటు, సైనిక అవసరాలకు ఉపయోగపడేలా పి.గుడిపాడు, సింగరాయకొండ సమీపంలో ప్రత్యేక రన్‌వేలు నిర్మించారు. గతంలో దిగకుండా విమానాలతో ట్రయల్ రన్ నిర్వహించగా, నేడు రన్‌వేపై విమానాలు దించి ట్రయల్ రన్ నిర్వహించారు ఎయిర్ ఫోర్స్ అధికారులు. ఉదయం నుంచే కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. వాయుసేనకు చెందిన సుఖోయ్ 30, జెట్ ఫైటర్ హాక్ కార్గో విమానాలు ఏఎన్ 32, డోర్నియర్ విమానాలు ఇలా.. ఉదయం 10:30 గంటల నుంచి విడతల వారీగా యుద్ధ విమానాల రాక మొదలైంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు రహదారిపై దిగి సందడి చేశాయి. రన్‌వేపైకి ఇతరులెవరూ రాకుండా బారికేడ్లు కట్టారు. రాడార్ వాహనంతో పాటు అత్యాధునిక సాంకేతిక వాహనాలను రన్‌వే సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆశ్రమంలో ఉంచారు. రోడ్డుపై ఆకాశ బండ్లు చేసే విన్యాసాలను తిలకించేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ట్రయల్ రన్ సందర్భంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను దారి మళ్లించారు.

న్యూస్‌రీల్

ఎన్ఎంఎంఎస్‌కు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 2019,2020, 2021, 2022 సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులు ప్రస్తుతం 9,10,11,12 తరగతులు చదువుతూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు లేదా రెన్యువల్ చేసుకున్న ప్రతి విద్యార్థి తప్పకుండా తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేకుంటే సదరు విద్యార్థి ఉపకార వేతనం వారి బ్యాంకు ఖాతాలో జమకాదన్నారు. విద్యార్థి తమ మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌తో సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆధార్ సీడింగ్ చేయించుకోవాలన్నారు. న్యూఢిల్లీలోని విద్యా మంత్రిత్వశాఖ వారు నేరుగా విద్యార్థి ఆధార్‌కు సీడ్ అయిన బ్యాంకు ఖాతాలో నగదు రహిత లావాదేవీల ద్వారా ఉపకార వేతనాన్ని జమచేస్తారన్నారు. ఆధార్ సీడింగ్ కాకపోతే ఉపకార వేతనం జమచేయరని, ఉపకార వేతనం స్టేటస్ కేవలం విద్యార్థి లాగిన్‌లో మాత్రమే తెలుస్తుందన్నారు.

దర్శిలో రైలు కూత

● తొలిసారి దర్శి స్టేషన్‌లోకి రైలు రాక



రైలు వచ్చేందుకు కొబ్బరికాయలు కొడుతున్న అధికారులు

దర్శి: నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా దర్శి రైల్వే స్టేషన్‌లో పనులు కూడా వేగవంతమయ్యాయి. ట్రాక్‌ను సిద్ధం చేసిన తరువాత తొలిసారిగా స్టేషన్‌లోకి గూడ్స్ రైలు వచ్చింది. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్లు ట్రాక్ పై కొబ్బరికాయలు కొట్టి రైలుని స్టేషన్‌లో ట్రాక్ మీదకు తీసుకొచ్చారు. ట్రాక్ పై రైలుని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు. ఈనెల 25వ తేదీ నాటికి రైల్వే పనులు పూర్తవుతాయన్నారు. తరువాత గుంటూరు నుంచి దర్శికి రైలు నడిపే ఆలోచనలో రైల్వే అధికారులు ఉన్నారు. ఇదే జరిగితే దర్శి ప్రయాణికులకు గుంటూరు ప్రయాణం తక్కువ ధరలో సాకారం అవుతుంది.



దర్శి రైల్వేస్టేషన్‌లోకి వచ్చిన రైలు

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు



రూం నంబర్లను చూసుకుంటూ..



సింగరాయకొండలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఒంగోలు: పదో తరగతి రెగ్యులర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తొలి పరీక్ష కావడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలకు చేరుకునే సమయంలో ఎటువంటి అంతరాయం లేకుండా నగరంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమలు, పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు స్మార్ట్ ఫోన్, స్మార్ట్ వాచీలతోపాటు ఇతరత్రా ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు లోపలకు తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. చుట్టుపక్కల ఎక్కడా పరీక్షలు జరుగుతున్నంత సేపు జెరాక్స్ సెంటర్లు తీసి ఉంచకుండా మొబైల్ పార్టీలను పోలీసుశాఖ రంగంలోకి దించింది. మాస్ కాపీయింగ్ చేసినా, అందుకు సహకరించినా కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించడంతో అన్ని పోలీసుస్టేషన్ల హౌస్ ఆఫీసర్లు అప్రమత్తమయ్యారు. ఇక ప్రశ్నపత్రాలను స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించడం, పరీక్ష ముగిసిన అనంతరం జవాబు పత్రాలను పోస్టాఫీసుల్లో డిపాజిట్ చేయడం వరకు ప్రత్యేకంగా ఎస్కార్టు సౌకర్యం కల్పించారు.

జిల్లాలో 765 మంది విద్యార్థులు గైర్హాజరు: మొత్తం 30,082 మంది హాజరుకావాల్సి ఉండగా 29,317 మంది హాజరయ్యారు. 97.45 శాతం విద్యార్థులు హాజరయ్యారు. 765 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 48 సెంటర్లలో సిట్టింగ్ స్క్వాడ్లను నియమించారు. జిల్లా పరిశీలకులు ఎంఆర్ ప్రసన్నకుమార్ అమ్మనబ్రోలు-2, ఉప్పుగుండూరు-2, కొత్తపట్నం-2, కరువది-1 సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర స్థానిక గుంటూరు ఆక్స్‌ఫర్డ్, సెయింట్ థెరెస్సా, బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, స్థానిక సెయింట్ జేవియర్స్, టంగుటూరు భాష్యం, టంగుటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక ఫ్లయింగ్ స్క్వాడ్లు 5 పోలీసు స్టేషన్లలోని ప్రశ్నపత్రాల తరలింపు ప్రక్రియతోపాటు 60 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. తొలి రోజు పరీక్ష పూర్తి ప్రశాంత వాతావరణంలో జరిగిందని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని డీఈవో డి.సుభద్ర తెలిపారు.

పదో తరగతి పరీక్ష రాసిన ఖైదీలు: ఒంగోలు టౌన్: ఒంగోలులో ఖైదీల కోసం ప్రత్యేక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారి, ఒక సిట్టింగ్ స్క్వాడ్, ఒక ఇన్విజిలేటరును నియమించారు. ఒక శిక్షా ఖైదీ, ఆరుగురు ముద్దాయిలు పదో తరగతి పరీక్ష రాశారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

● దళిత నాయకులతో ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి, సంతనూతలపాడు మండలాలకు చెందిన దళిత నాయకుల ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పేర్నమిట్ట లింగారెడ్డి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి చీమకుర్తి, సంతనూతలపాడు మండలాలకు చెందిన పలువురు ఎస్సీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించేందుకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామన్నారు. రెండు మండలాలకు చెందిన ఎస్సీ వర్గానికి చెందిన ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, పలు గ్రామాల నుంచి ఎస్సీ వర్గానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీకి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు.

ఉసురు తీసిన ఈత సరదా



విద్యార్థులు మృత్యువాతపడిన క్వారీలోని నీటిగుంత



లాలావలి (ఫైల్)



ప్రసన్న (ఫైల్)

● ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారుల మృతి

పెద్దదోర్నాల: సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు క్వారీ గుంతలో మునిగి విగతజీవులైన సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని బలిజేపల్లి గిరిజన గూడెం సమీపంలో చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం జరగ్గా సోమవారం వెలుగుచూసింది. ఎస్సై అంకమరావు తెలిపిన వివరాల మేరకు పెద్దదోర్నాల ఇందిరానగర్‌కు చెందిన దూదేకుల లాలు, దూదేకుల మున్ని రెండో సంతానమైన లాలావలి (9) స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. పక్కవీధిలో నివసిస్తున్న కొండబోయిన గిరిప్రసాద్ కుమారుడైన ప్రసన్న (12) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం సెలవు కావడంతో వీరిద్దరూ బలిజేపల్లి వద్ద ఉండే క్వారీ వద్దకు ఈతకు వెళ్లారు. తమ దుస్తులు, చెప్పులు నీటి ఒడ్డున వదిలి సరదాగా చేపలు పట్టి ఓ సీసాలో భద్రపరిచారు. పది అడుగుల లోతున్న నీటి గుంతలో ఈతకొట్టేందుకు దిగి లోతు ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ ఈత రాక నీటి అడుగున్న ఉన్న మట్టిలో కూరుకుపోయి మృతి చెందారు. పిల్లలు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు రాత్రి అంతా వెతికినా వారి ఆచూకీ తెలియలేదు. సోమవారం క్వారీ గుంత నుంచి లాలావలి మృతదేహం బయటకు తేలి ఉండటాన్ని కొందరు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. ఎస్సై అంకమరావు సంఘటనా స్థలికి చేరుకుని లాలావలి మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీయించారు. అనంతరం కొందరు యువకుల సహకారంతో నీటి అడుగులో చిక్కుకుపోయిన మరో మృతదేహం కోసం గాలిస్తుండగా పక్క నుంచి ప్రసన్న మృతదేహం నీటిలో తేలింది. చిన్నారుల మృతితో ఇందిరానగర్ కాలనీలో తీవ్ర విషాదం నెలకొంది. లాలావలి తల్లి దూదేకుల మున్నీ తొమ్మిదేళ్ల క్రితమే మృతిచెందగా తండ్రి లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో లాలావలి బంధువుల ఇంట్లో పెరుగుతున్నాడు. ప్రస్తుతం తండ్రి లారీ పనిపై బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఉండటం స్థానికుల్లో విషాదం నింపింది. పక్క వీధిలోనే ఉంటున్న కొండబోయిన ప్రసన్న తండ్రి గిరిప్రసాద్ స్థానికంగా ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.



నీటిలో నుంచి బయటకు తీసిన మృతదేహాలు

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



కొండపిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ఆదిమూలపు సురేష్

● కొండపి లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరటమే లక్ష్యం

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్

కొండపి (మర్రిపూడి): కొండపిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయటమే లక్ష్యంగా కృషి చేస్తున్నానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కొండపిలోని నూతన వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీలో చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ మూడు నెలల కాలంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి లబ్ధిదారులకు సుమారు రూ.1.15 కోట్లకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశానని, బోర్ల మరమ్మతులు చేయించటంతో పాటు కొత్త బోర్లు వేశానని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశానని, అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేశానని, రోడ్లకు మరమ్మతులు చేయించానని, గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేశానని గుర్తు చేశారు. తాను చేస్తున్న అభివృద్ధిని చూసి ఇటీవల కాలంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ లోకి చేరికలు బాగా పెరిగాయన్నారు. కొండపి మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన 11 కుటుంబాల టీడీపీ సానుభూతిపరులు చాపల ఈశ్వరమ్మ, లక్కీ తిరుపతమ్మ, చాపల నాగమణి, కుందుర్తి రమణమ్మ, చావలి రమాదేవి, కుందేటి రాణి, కుందేటి చిన్నమ్మ, కుందేటి మల్లమ్మ, బొజ్జా రమాదేవి, బొత్తుల వెంకట రత్నమ్మ, చావలి కోటేశ్వరమ్మలు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీ కొర్నేలు, బీ ఇసాకు, సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం ఉపేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగం, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, బొక్కిసం సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారన్నారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి మంత్రి సురేష్ సాదరంగా ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలుంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు

● నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: గత మూడేళ్లలో ఒంగోలు నగరంలో వంద కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. నగర పాలక సంస్థ పాలక వర్గం మూడేళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం మేయర్ స్వగృహంలో యువనేత బాలినేని ప్రణీత్ కుమార్ కేక్ కట్ చేసి నగర మేయర్, కార్పొరేటర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ సుజాత మాట్లాడుతూ... నగరపాలక సంస్థ రెవెన్యూ తగినంతగా లేకపోయినా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో కనీసం రూ.2 నుంచి రూ.9 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. పాలక వర్గం ఎన్నికైన తరువాత మొదటి సంవత్సరమంతా కరోనా ఇబ్బంది పెట్టిందని, అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆ మహమ్మారి నుంచి బయట పడినట్లు చెప్పారు. తొలిసారిగా అనేక మంది మహిళా కార్పొరేటర్లు ఎన్నికైనప్పటికీ పరిపాలన పరంగా సత్తా చాటుకున్నారని అభినందించారు. బాలినేని కుటుంబం ఒంగోలు నగరాభివృద్ధికి పాటుపడుతోందని, నిరుపేదలకు అండగా నిలుస్తోందన్నారు. పాలక వర్గంపై బాలినేని పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. తనకు మేయర్‌గా అవకాశం ఇచ్చిన జగనన్న, వాసన్నలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లందరూ హాజరయ్యారు.



కేక్ కట్ చేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు

క్లుప్తంగా

హైవే పెట్రోలింగ్ వాహనం ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

మార్కాపురం: హైవే పెట్రోలింగ్ వాహనం ఢీకొని బాలుడికి గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్టేట్‌లో చోటుచేసుకుంది. ఎస్టేట్‌కు చెందిన కొప్పుల రాణి కుమారుడు రవికుమార్ రోడ్డు దాటుతుండగా హైవే పెట్రోలింగ్ వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై షేక్ అబ్దుల్ రెహమాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని ముగ్గురికి..

పొదిలిరూరల్: ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘన పొదిలి మండలంలోని తలమళ్ల పంచాయతీ ఫిర్‌దౌస్ నగరు సమీపంలో ఒంగోలు–కర్నూలు రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఫిర్‌దౌస్‌నగరుకు చెందిన షేక్ బాబా సాహెబ్, పెదమస్తాన్ వలి, నాయబ్‌రసూల్ ముగ్గురు బైక్‌పై ఒంగోలు వైపు వెళుతున్నారు. ఈ సమయంలో ఒంగోలు నుంచి పొదిలి వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో బైకు కిందపడిపోయింది. టిప్పర్ మాత్రం ఆపకుండా వెళ్లిపోయింది. . ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న ముగ్గురికి తల, శరీరం, కాలుకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వీరిని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి..

గిద్దలూరు రూరల్: ఎన్నికల కోడ్ సందర్భంగా నగర పంచాయతీ పరిధిలోని ఒంగోలు రోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ఫ్లెక్సీలు తొలగిస్తుండగా నగర పంచాయతీ ఒప్పంద కార్మికునికి విద్యుత్ షాక్ తగిలి గాయాలయ్యాయి. భాస్కర్ అనే ఒప్పంద కార్మికుడు ఫ్లెక్సీలు తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మద్దిపాడు: డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందగా..మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మద్దిపాడు సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే..జగదీష్‌బాబు(20), అతని స్నేహితుడు చెన్నైకు చెందిన ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. వారు అద్దంకిలో కలెక్షన్ చేసుకొని తిరిగి ఒంగోలు వెళుతుండగా మార్గమధ్యంలో మద్దిపాడు సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో జగదీష్‌బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితునికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుడు పనిచేస్తున్న కంపెనీని సంప్రదించి అతని బంధువులకు సమాచారం తెలియజేశారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించి సహకరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. ఎన్నికల నిర్వహణపై అన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం ప్రకాశంభవనంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంతో ఉంటుందని అదేవిధంగా రాజకీయ పార్టీలు ఎన్నికల నిర్వహణకు నిబంధనల మీరకుండా సహకరించాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అవగాహన చేసుకుని పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు పార్టీలకు సంబంధించిన గుర్తులు, రాజకీయ పార్టీల నేపథ్యం ఉన్న వ్యక్తులకు సంబంధించిన ఫొటోలను అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్, పబ్లిక్ ప్రదేశాల్లో పూర్తి తొలగిస్తామన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయా పార్టీల పాలసీల గురించి మాట్లాడుకోవచ్చన్నారు. కానీ వ్యక్తిగత విమర్శలకు పాల్పడవద్దన్నారు. ఎటువంటి హింసాత్మక సంఘటనలకు తావులేకుండా ఎన్నికల మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాజకీయ ప్రచార సమయం ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే చేయాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా లౌడ్ స్పీకర్‌లు వినియోగించాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్‌లు వినియోగించకూడదన్నారు. జిల్లాలో మీడియా సర్టిఫికెషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రకటనలు ఇచ్చే సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో ర్యాలీలు నిర్వహిచుకునేందుకు వాహనాలు, తాత్కలిక ఎన్నికల కార్యాలయ ఏర్పాటు, లౌడ్ స్పీకర్‌లు ఏర్పాటు కోసం అనుమతి తీసుకునేందకు సింగిల్ విండో క్లియరెన్స్ కోసం సువిధ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలన నిర్వహించామన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే ఏ కార్యక్రమం అయినా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లఘంనగానే పరిగణిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, వైఎస్‌ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రాజశేఖర్, కాలేషాబేగ్, రసూల్‌బాష, ఎర్రయ్య, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

బాలికల అదృశ్యం కేసు.. ఇద్దరు నిందితులు అరెస్టు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలసుందరరావు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలాసుందర్‌రావు

రాచర్ల: రాచర్ల ఫారం గ్రామానికి చెందిన ఇద్దరు బాలికల అదృశ్యం కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ బాల సుందరరావు వెల్లడించారు. రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆ ఇద్దరు బాలికలు జనవరి 29వ తేదీన పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. అయితే వారిని అదే గ్రామానికి చెందిన దూదేకుల వంశీ, బిల్లెల కాశింపీరా మాయమాటలు చెప్పి తమ వెంట తీసుకెళ్లారు. బాలికల తల్లులు ఇచ్చిన ఫిర్యాదుతో ప్రత్యేక పోలీసు బృందాన్ని నియమించి నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. 40 రోజులుగా వేర్వేరు ప్రాంతాల్లో బాలికలతో కలిసి తిరిగిన నిందితులు సోమవారం గిద్దలూరు పట్టణంలోని రాచర్ల బస్‌స్టాండ్ సెంటర్‌లో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. హుటాహుటిన పోలీసులు అక్కడకు చేరుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం దూదేకుల వంశీ, బిల్లెల కాశింపీరాను కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. బాలబాలికల వ్యవహార శైలిని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని, సెల్ ఫోన్ వినియోగించకుండా కట్టడి చేయాలని ఈ సందర్భంగా డీఎస్పీ హితవు పలికారు. సమావేశంలో గిద్దలూరు సీఐ దాసరి ప్రసాద్, రాచర్ల ఎస్సై వి.హరిబాబు పాల్గొన్నారు.

అక్రమ డబ్బు తరలింపు అరికట్టాలి

● బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
● కలెక్టర్ దినేష్‌కుమార్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, అక్రమ డబ్బు తరలింపును అరికట్టేందుకు అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతోపాటు వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనుమానాస్పద లావాదేవీలు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని బ్యాంకులను ఈఎస్ఎంఎస్ యాప్‌లో అనుసంధానం చేశామన్నారు. ప్రధాన బ్యాంకుల నుంచి ఏటీఎం కేంద్రాలకు నిధులు తరలించే సమయంలో సంబంధిత వివరాలను స్పష్టంగా బాక్స్‌లపై ప్రస్తావించడంతోపాటు పూర్తి వివరాలను క్యూఆర్ కోడ్ రూపంలో అందుబాటులో ఉంచాలన్నారు. తద్వారా ఆ డబ్బుకు సంబంధించిన పూర్తి వివరాలు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సభ్యులకు సమగ్రంగా తెలుస్తాయన్నారు. దీనిపై ప్రత్యేకంగా ఎస్ఓపీ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ శ్రీలత, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, ఈఎస్ఎంఎస్ సాంకేతిక పరిశీలకులు భరద్వాజ్, పలువురు బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఎలక్షన్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తున్న ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌ను సోమవారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పరిశీలించారు. కంట్రోలు రూమ్‌లో ఏర్పాటు చేస్తున్న సోషల్ మీడియా సెల్, సింగిల్ విండో అనుమతులు, 24/7 కాల్ సెంటర్, కంప్‌లెంయిటింగ్ మానిటరింగ్ సెల్, రిపోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం, ఎన్నికల వ్యయ విభాగాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తగిన సూచనలు చేసి, కంట్రోలు రూమ్‌ను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్వీప్ నోడల్ అధికారి రవి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

నేటి నుంచి పృథులగిరి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్

మర్రిపూడి: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పృథుల గిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా ఫాల్గుణ శుద్ధ దశమి నుంచి వైభవంగా సాగే ఈ బ్రహ్మోత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతారు. ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు ఈఓ ఎం.శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

ఈనెల 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణం, 21న హంస వాహన సేవ, 22న సింహ, 23 హనుమంత, 24న గరుడ వాహన సేవ, 25న ఎదుర్కోలు ఉత్సవం, గజోత్సవం, స్వామివారి కళ్యాణం, 26న రథోత్సవం, 27న అశ్వవాహనం, 28న ధ్వజారోహణ, పూర్ణాహుతి, 29న ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. బ్రహ్మోత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్సైలు, 20 మంది కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొంటున్నారు. భక్తుల సౌకర్యార్థం 20 ఆర్టీసీ బస్‌లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజారవాణాధికారి సుధాకరరావును సత్కరిస్తున్న ఆర్టీసీ ఈయూ నాయకులు

● ప్రజా రవాణా శాఖ అధికారి సుధాకరరావు

ఒంగోలు: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజారవాణాశాఖ అధికారి బి.సుధాకరరావు పేర్కొన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఆర్టీసీ నెల్లూరు జోన్ పరిధిలోని 31 డిపోల పరిధిలోని గ్యారేజీ ఉద్యోగులతో ఈయూ నాయకత్వం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విడి భాగాల కొరత లేకుండా చూడడం, సాంకేతికతకు తగ్గట్లుగా విడి పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. ఉద్యోగులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తప్పకుండా పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ విలీనానికి ముందు ఉన్న ప్రోత్సాహక పథకాలు, ప్రయోజనాలను యథావిధిగా కొనసాగించాలని, వైద్య సౌకర్యం కూడా పాత పద్ధతిలోనే రిఫరల్ ఆసుపత్రి విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. 2017 పీఆర్‌సీ బకాయిల చెల్లింపులపై ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఇటీవలే కలిసి విజ్ఞప్తి చేశామని, వాటితోపాటు గ్యారేజీ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను కూడా ప్రస్తావించామన్నారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు వాకా రమేష్, బాబు శామ్యూల్, ముఖ్య ఉపాధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి స్వరూపారాణి, సంయుక్త కార్యదర్శి బెజవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తత అవసరం

● సమన్వయంతో తనిఖీ చేయండి
● కలెక్టర్ దినేష్‌కుమార్



ఎస్పీతో కలిసి ఎన్నికల తనిఖీపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం, బంగారు, వెండి ఆభరణాలు ఇతర వస్తువులు తరలింపును తనిఖీ చేసే సమయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. ప్రకాశంభవనంలో ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డితో కలిసి సోమవారం పలు శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలు, అక్రమాలు లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీ విధుల్లో ఉన్న ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టి సభ్యులకు విధులు, నిబంధనలుపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. పది లక్షల రూపాయల లోపు, ఆపై నగదు చెల్లిస్తున్నట్లు బృందాలు గుర్తిస్తే ఆ డబ్బులు ఎన్నికలకు సంబంధించినవా లేక ఇతర అవసరాలకు వినియోగించేవా తెలుసుకోవాలన్నారు. ఎంత మొత్తం గుర్తిస్తే ఏ విభాగం అధికారులకు ఆ సమాచారాన్ని తెలియచేయాలనే విషయంపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. డబ్బు, మద్యం, ఇతర వస్తువులు ప్రత్యేకంగా నిల్వ చేసినట్లు గుర్తిస్తే వాటిని సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పట్టుబడిన డబ్బు, మద్యం ఇతర వస్తువులను డిస్పోజ్ చేయడంలో పోలీసు శాఖకు సంబంధించి విధానాలను ఎస్పీ పరమేశ్వరరెడ్డి వివరించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ శ్రీలత, డీటీసీ సుశీల, డీటీఓ జగన్నాథరావు, ఇన్‌కంట్యాక్స్ విభాగం నోడల్ అధికారులు, జీఎస్‌టీ, ఆడిట్ అధికారులు పాల్గొన్నారు.

చూసుకో.. రాసుకో..!

● ఓపెన్ స్కూల్ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్



రావిపాడులో స్లిప్పులు తీసుకెళ్తున్న సిబ్బంది

సింగరాయకొండ(మర్రిపూడి)/కంభం: ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపీయింగ్ సాగుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ పరీక్షలకు విద్యార్థులే కాకుండా ఆయా కేంద్రాల్లోని సిబ్బంది కూడా స్లిప్పులు తీసుకెళ్లడం గమనార్హం. సింగరాయకొండలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు హడావుడి చేసినా అదంతా కాసేపేనని తేలిపోయింది. 'ఏది పడితే అది రాయవద్దని, కొంతసేపు ఆగితే చిట్టీలు పంపిణీ చేస్తామని కొందరు ఇన్విజిలేటర్లు చెప్పడంతో తీరిగ్గా కూర్చుని ఎదురు చూశారు. పరీక్ష ఇంకో అరగంటలో ముగుస్తుందనగా విద్యార్థులకు ఏకంగా జవాబు పత్రాలు అందించారు. 20 నిమిషాల తర్వాత స్పెషల్ స్క్వాడ్ వస్తోందని చెప్పి జవాబు పత్రాలు లాగేసుకోవడంతో ముందంతా సమయం వృథా అయిందని, ఏమీ రాయలేకపోయామని కొందరు విద్యార్థులు వాపోయారు. పరీక్షలో కాపీయింగ్‌కు సహకరించేందుకు ఒక్కో విద్యార్థి వద్ద రూ.10 వేల నుంచి రూ.15 వేలు తీసుకున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

రావిపాడులో..

కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ పరీక్షలు నిర్వహించారు. రావిపాడు పరీక్ష కేంద్రంలో జోరుగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడినట్లు తెలిసింది. పరీక్ష కేంద్రంలోకి సిబ్బంది స్లిప్పులు పంపిస్తూ మీడియా కంటపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రావిపాడు గ్రామంలో ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రం కేటాయించడం విమర్శలకు తావిచ్చింది. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

తొలి రోజు పరీక్షలకు 522 మంది గైర్హాజరు

ఒంగోలు: జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ పరీక్షలు 9 సెంటర్లలో, ఇంటర్ పరీక్షలు 25 సెంటర్లలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించారు. 522 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని డీఈఓ డి.సుభద్ర తెలిపారు.

- ఎస్ఎస్‌సీ తెలుగు పరీక్షకు 1473 మందికిగాను 1319 మంది, ఉర్దూ పరీక్షకు 15 మందికి 13 మంది హాజరయ్యారు.
- హిందీ పరీక్షకు 36 మందికిగాను 29 మంది, తెలుగు పరీక్షకు 4,680 మందికిగాను 4,323 మంది, ఉర్దూ పరీక్షకు 18 మందికిగాను 16 మంది హాజరయ్యారు. ఎస్ఎస్‌సీ పరీక్షకు 156 మంది, ఇంటర్ పరీక్షలకు 366 మంది గైర్హాజరైనట్లు డీఈఓ వివరించారు.



సింగరాయకొండ–ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఓపెన్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసులు

పొత్తులతో కాదు.. ప్రజాభిమానంతో గెలుస్తాం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న శివప్రసాదరెడ్డి

● వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
● మేలు జరిగితే ఓటు వేయండని అడిగే దమ్మున్న నేత జగన్

దర్శి: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు పొత్తులు పెట్టుకొని వచ్చినా వైఎస్సార్ సీపీదే విజయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం మన ఊరు మన శివన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి కుటుంబానికి క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాభిమానమే గెలుస్తుంది కానీ పొత్తులు గెలవవన్నారు. చంద్రబాబు, పవన్‌లకు గెలిచే దమ్ములేక పొత్తులు పెట్టుకుంటున్నారని విమర్శించారు. మీకు మేలు జరిగితే ఓటు వేయండని అడిగే దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పేద పిల్లలు సైతం తన పిల్లలతో సమానంగా కార్పొరేట్ విద్యను అందించాలని జగన్ కోరుకుంటే చంద్రబాబు పిల్లలను మాత్రం ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లలో చదివించి పేదలకు ఇంగ్లిష్ మీడియం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో జగనన్న పక్కన కూర్చునే భాగ్యాన్ని నా కుమారుడికి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాష, ఎంపీపీ సుదా అచ్చయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కేవీరెడ్డి, వైస్ ఎంపీపీ కొరివి మసలయ్య, సోము దుర్గారెడ్డి, సర్పంచ్ బట్టు రామారావు, ఎంపీటీసీలు ఇల్లూరి సుబ్బారెడ్డి, ఇల్లూరి నాగిరెడ్డి, బాలిరెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు యరమల మధుసూదన్‌రెడ్డి, ముత్తులూరి శివారెడ్డి, మాదిరెడ్డి రమణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ పొలిమేర నాగిరెడ్డి, సగిలి లింగారెడ్డి, రాచపూడి యోహాను, ఆవుల కోటయ్య, ఎర్రబోలు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.